క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



బ్రహ్మగుండం ఆలయ హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: పట్టణ సమీపంలో కామేశ్వరీ దేవి సమేత బ్రహ్మగుండేశ్వరుడు వెలసిన ప్రముఖ శైవక్షేత్రం బ్రహ్మగుండం దేవస్థానం హుండీ కానుకల లెక్కింపును సోమవారం ఆలయ ఈఓ హనుమంతరావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతేడాది జులై నుంచి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపంలో రూ.89,851 లభించినట్లు ఈఓ తెలిపారు. ఆలయ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, బొమ్మన పెద్దిరెడ్డి, రఘురెడ్డి, అనిల్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద, చిన్నహ్యాట తదితర గ్రామాలకు చెందిన ఒంటరి వృద్ధులు, దివ్యాంగులు, మరి కొందరికి సోమవారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థ గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో బియ్యం, కంది బ్యాళ్లు, వంటనూనె, చక్కెర ఇతర సరుకులను అందజేశారు. ప్రతి నెలా సరుకులను అందిస్తున్నామని ప్రస్తుతం 13వ సారి పంపిణీ చేసినట్లు సభ్యులు వెల్లడించారు.

‘ఉపాధి’లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

తుగ్గలి: వలసల నివారణ కోసం ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా ఏపీడీ పద్మావతి హెచ్చరించారు. మామిళ్లకుంటలో పనులకు వెళ్లకున్నా మస్టర్లలో బినామీ పేర్లు రాస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆమె తనిఖీ చేశారు. పనిప్రదేశంలో మస్టర్లను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. పనులకు రాని వారి పేర్లు రాయడం వల్ల నిజంగా పనిచేసిన వారు నష్టపోతారన్నారు. బినామీ పేర్లు రాసి సొమ్ము కాజేయాలని చూస్తే అలాంటి గ్రూపులకు పనులు రద్దు చేస్తామన్నారు. టీఏ ప్రసాద్ వెంట ఉన్నారు.


నేడు పంచాయతీ దుకాణాల వేలం

వెల్దుర్తి: పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండులో నూతనంగా నిర్మించిన దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి కాంప్లెక్స్‌లోని 8 దుకాణాల కేటాయింపునకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ జేమ్స్ కృపవరం తెలిపారు. సంవత్సర కాలం దుకాణ నిర్వహణకు జరిగే వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని ఆయన కోరారు.

వేదావతి వంతెన ఎత్తు పెంచాలి

హొళగుంద: వేదావతి నదిపై ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ నిర్మించిన వంతెన ఎత్తు పెంచి రాకపోకల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని హొళగుంద మండల బీజేపీ నాయకులు సోమవారం ఆలూరుకు వచ్చిన బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజును కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు నరసింహప్రసాద్, నాయకులు మహేశ్ తదితరులు ఆయన్ను కలిసి మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇక్కడి ప్రజలు నిత్యం కర్ణాటకలోని బళ్లారి, ఇతర పట్టణాలకు విద్య, వైద్యం ఇతర పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. బ్రిడ్జి ఎత్తు లేకపోవడంతో వర్షాకాలంలో చిన్నపాటి వరదలకు వంతెనపై నీరు చేరి వారాల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నట్లు తెలిపారు. దీనివల్ల అత్యవసర సేవలు సైతం అందక చాలా మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన ఎత్తు పెంచేలా కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. దీనిపై సోము వీర్రాజు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

ఏఎస్‌ఐగా పదోన్నతి



జి.రంగస్వామి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.రంగస్వామి ఏఎస్‌ఐగా పదోన్నతిపై జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం రంగస్వామి మాట్లాడుతూ పదోన్నతితో తన బాధ్యత పెరిగిందన్నారు. పదోన్నతి పొందిన రంగస్వామిని పోలీసులు అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

వెల్దుర్తి: మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి సోమవారం పరిశీలించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవన నిర్మాణాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. దాదాపు రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఆసుపత్రి పనులు చివరి దశకు చేరుకోవడంతో త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని కోరారు. అనంతరం బ్రహ్మగుండం క్షేత్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నూతనంగా క్యూలైన్ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలపై ఆలయ తాజా మాజీ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డితో కలిసి చర్చించారు. అలాగే రామళ్లకోట ప్రధాన రహదారి నుంచి జగనన్న కాలనీకి ఏర్పాటు చేయనున్న రహదారిని పరిశీలించారు. పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు వెంట ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గృహ సారథులు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి
- అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం
- మంత్రి గుమ్మనూరు జయరాం దిశానిర్దేశం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం



హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

ఆలూరు: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో ఆలూరు, చిప్పగిరి మండలాలకు చెందిన గృహ సారథులు, కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. అన్ని పార్టీల వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మూడున్నరేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రభుత్వం దాదాపు వెయ్యి కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో తేడాలను వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీలు రంగమ్మ, జూటూరు హేమలత, నాయకులు మల్లికార్జున రెడ్డి, రాం భీమ్‌నాయుడు, నారాయణ, మారయ్య, మల్లికార్జున, బీసీ మాదన్న శ్రీరాములు, నాగవేణి, శ్రీధర్, హనుమయ్య, ఆలూరు, చిప్పగిరి మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయం నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లతో సమన్వయంగా పనిచేసి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలనే ప్రభుత్వ ఆశయసాధనకు అనుగుణంగా పనిచేయాలన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో 50 ఇళ్లకు నియమితులైన ఇద్దరు గృహ సారథులు, ముగ్గురు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఈనెల 11వ తేదీ నుంచి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధి గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని సూచించారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలన్నారు. గృహసారథులకు పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, గోనెగండ్ల సింగిల్‌విండో అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, మాజీ కో–ఆప్షన్ మెంబర్ బందెనవాజ్, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, లోకారెడ్డి, రవూఫ్, పెద్దారెడ్డి, సత్యంస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తిలో ఎమ్మెల్యే పర్యటన

వెల్దుర్తి: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం వెల్దుర్తిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం హైవే–44 పక్కన గల లిమ్రాస్ ఫంక్షన్ హాల్‌లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం పట్టణంలోని సచివాలయం–3 పరిధిలోగల పలు వార్డులలో నిర్వహించబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో కొలువుదీరిన కొలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపోత్సవాల్లో భాగంగా చెన్నకేశవ స్వామి, శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు, వసంతోత్సవం, పారువేట, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం హుండీ ఆదాయం లెక్కించగా రూ 2,67,677 సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే టికెట్ల విక్రయం ద్వారా రూ 53,485, తలనీలాల నుంచి రూ 3.60 లక్షలు, టెంకాయల విక్రయం ద్వారా రూ 1.60 లక్షలు, దాతల నుంచి డొనేషన్లు రూ 1.10 లక్షలు సమకూరినట్లు చెప్పారు. కబడ్డీ పోటీలు నిర్వహించిన గెలుపొందిన వారికి కప్పట్రాళ్ల మల్లికార్జున షీల్డ్ అందజేశారు. వాల్మీకి యువదళం నాయకుడు సురేంద్రనాయుడు క్రీడాకారులకు దుస్తులు, వసతి కల్పించారు.

కేంద్ర బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ అధికారులు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సోమవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.ప్రదీప్‌కుమార్, పి.సంతోష్‌కుమార్ పర్యటించారు. గ్రామసభ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో పక్కాగా అమలవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో సందర్శించి ఉపాధి పనులు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇంటి నిర్మాణాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వైకేపీ ద్వారా అమలయ్యే సంక్షేమ పథకాలు, ఉపాధి పనులు, వేతనాలు, పనిదినాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, ఇంటి నిర్మాణాలు బాగున్నాయని తెలిపారు. సర్పంచ్ లక్ష్మి, వాటర్‌షెడ్ పీడీ సలీంబాషా, ఏపీడీ అలిపీర, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, వైకేసీ ఏపీఎం చిన్నపీరన్న, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం



చిప్పగిరిలో స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులు

గోనెగండ: స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. స్పందనలో అడంగల్, భూ సర్వే, పింఛన్ తదితర సమస్యల పరిష్కారం కోసం వినతులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను గ్రామ సచివాలయంలో పరిష్కరించుకోవచ్చన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈఓఆర్డీ నాగేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. సూపరింటెండెంట్ సుధాకర్ రాజు, ఏఓ ఆనంద్, ఏపీఎం నాగార్జున ఆర్‌డబ్ల్యూఎస్ రాంసీలా పాల్గొన్నారు.

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.పురుషోత్తం ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన స్పందనలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. సాయంత్రం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్ చర్యలపై నిరసన



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఆలూరు రూరల్: జాతీయ నేతల చిత్ర పటాలను గోడపై నుంచి తొలగించి మూలన పెట్టిన ఆలూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆలూరు మండల కార్యదర్శులు పోతురాజు, మైనా ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. సదరు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ మల్లికార్జున, ఎంఈఓ కోమలాదేవి డిగ్రీ కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. జాతీయ నేతలు, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలను తిరిగి గోడపై అతికించారు. ఘటనపై ప్రిన్సిపాల్ సింహాద్రిని వివరణ కోరగా ‘తాను చేసిందే కరెక్ట్’ అని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు తహసీల్దార్ చెప్పారు. ప్రిన్సిపాల్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ స్వామి, డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి గోవర్ధన్ కళాశాల విద్యార్థులు ఉన్నారు.

క్రాప్ బుకింగ్ పరిశీలన



క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ఆనంద్

చిప్పగిరి: వ్యవసాయ సిబ్బంది ఈ–క్రాప్‌లో నమోదు చేసిన పంటలను ఏఓ ఆనంద్ సోమవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని బెల్డోణ, రామదుర్గం, నగరడోణ, నేమకల్లు తదితర గ్రామాలలో ఏఓ పర్యటించి ఈ–క్రాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా పంటలను పరిశీలించారు. అయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని, సాగు చేసిన పంట వివరాలు మాత్రమే నమోదు చేయించుకోవాలన్నారు. ఎంపీఈఓ ప్రతాప్ పలువురు రైతులు వెంట ఉన్నారు.

వైభవంగా అమ్మవారి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దికెర: మండల కేంద్రంలో వెలసిన మద్దమాంబ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ముందుగా అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని, ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి లగ్నోత్సవం కార్యక్రమం చేసి అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరుబజారులో వైభవంగా ఊరేగింపు చేశారు. కల్యాణానికి విచ్చేసిన భక్తులకు హోటల్ సూరి అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపారని పీడీ రాముడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులు ఉష, మహేంద్ర, విజయకుమార్‌ను ప్రిన్సిపాల్ ఫణీంద్ర, పీడీ రాముడు, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ.. 8వ తరగతి చదువుతున్న ఉష గత డిసెంబర్ 25, 26 తేదీల్లో కర్నూలులో అండర్ –14 విభాగంలో జరిగిన బ్రాడ్ జంప్, 600 మీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానం, మరో 600 మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 9, 10 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉష వెళ్తున్నట్లు చెప్పారు. అలాగే అండర్– 19 విభాగంలో ఈనెల 2, 3 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ 57 కేజీల విభాగంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న మహేంద్ర మూడవ స్థానం, 61 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విజయ్‌కుమార్ మూడవ స్థానంలో నిలిచినట్లు పీడీ చెప్పారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లోనూ సత్తా చాటాలని వారికి సూచించారు.

వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్య

వెల్దుర్తి: పుల్లగుమ్మికి చెందిన వివాహిత బెస్తరాణి (22) ఆదివారం సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే. తన కుమార్తె అనారోగ్య సమస్యతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి బేతంచెర్ల మండలం గోసానిపల్లెకు చెందిన రంగస్వామి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి భర్త రవి, బంధుగణం పుల్లగుమ్మిలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆలూరు రూరల్ (హాలహర్వి): త్రోబాల్ జాతీయస్థాయి పోటీలకు హాలహర్వి విద్యార్థిని కీర్తన ఎంపికైనట్లు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వెంకట రమణ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న కీర్తన ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. విద్యార్థి కీర్తనను పీఈటీ విష్ణువర్ధన్ పాఠశాల సిబ్బంది అభినందించారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో సోమవారం దస్తగిరి స్వామి ఉరుసు ఘనంగా జరిగింది. దర్గాలో స్వామి వారిని భక్తులు ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేసి మొక్కుబడులు చెల్లించారు. స్వామి వారి అశ్వాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి పూజించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న సాయం రూ.1.80 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు హొళగుంద తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గజ్జెళ్లి కాశాప్పాచారి మాట్లాడుతూ.. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు పెద్యాట మారెప్ప, రంగన్న, పెద్యాట శ్రీరంగ, సతీష్‌కుమార్, మౌలాసాబ్, సలాంసాబ్, సిద్దబసవనగౌడ్, బెనకల్ సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వృషభాల జయకేతనం



విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలూస్వామి ఉరుసు సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల సైజు వృషభాల బండలాగుడు పోటీల్లో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వృషభాలు గెలుపొందాయి. పోటీలను హెడ్ కానిస్టేబుల్ భీమన్నతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రారంభించారు. పోటీల్లో కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం పెండేకల్ నాగభూషణం, డోన్ మండలం మల్యాల గ్రామం మైమున్నాకు చెందిన ఉమ్మడి జత ప్రథమ స్థానంలో నిలవగా, రెండో స్థానంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం, డి.రంగాపురానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు, మూడవ స్థానంలో పాములపాడు మండలం, తుమ్మలూరుకు చెందిన టి.పల్లవి వృషభాలు, కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కృష్ణాపురం శివరాముడు, వల్కూర్ గ్రామానికి చెందిన మద్దయ్య వృషభాలు సంయుక్తంగా నాల్గవ స్థానంలో నిలిచినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సాయంతో వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు. ఉరుసు సందర్భంగా లాలుస్వామి దర్గా సమీపంలో సాయంత్రం కిస్తీ వేడుకలు ఘనంగా జరిగాయి.

‘మానవతా మూర్తులు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పత్తికొండ రూరల్: స్థానిక గ్రంథాలయంలో సోమవారం కమల కళానికేతన్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రచయితలు హత్తిబెలగల్ రామలింగమ్మ, డాక్టర్ నల్లారెడ్డి సంయుక్తంగా రచించిన ‘మానవతా మూర్తులు’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ.. సమాజంలో నైతిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి పుస్తక రచనలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. రిటైర్డు హెచ్‌ఎం కాశీంశెట్టి, రిటైర్డు తహసీల్దారు షేక్షావలి పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయితలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. సాహితీవేత్తలు సవ్వప్పగారి ఈరన్న, హెచ్‌ఎం బీటీ లక్ష్మన్న, రంగన్న, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.39 లక్షలతో బస్టాండ్ ఆధునికీకరణ



ఆలూరు బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీసీఎం వెంకటరమణ, ఆదోని డీఎం రఫీక్

ఆలూరు రూరల్: ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా రూ.39 లక్షలతో ఆలూరు ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ వెంకట రమణ తెలిపారు. ఆయన సోమవారం ఆదోని డీఎం రఫీక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆలూరు బస్టాండ్ ఆవరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్టాండ్ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. అలాగే మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు తప్పనిసరిగా బస్టాండులో నిలిపేలా ఆదేశాలు జారీ చేశామన్నారు.

‘ఉపాధి కల్పిస్తామని చెప్పి మాట మార్చారు’

తుగ్గలి: భూములిచ్చిన కుటుంబాల వారికి ఉపాధి కల్పిస్తామని చెప్పి గోల్డ్ మైనింగ్ ప్రతినిధులు మోసం చేశారని పగిడిరాయి రైతు నారాయణరెడ్డి కుటుంబం సోమవారం మైనింగ్ ప్రదేశంలో సిబ్బందిని నిలదీశారు. వివరాలు.. నారాయణరెడ్డికి చెందిన 6 ఎకరాల భూమికి ధర కుదరకపోవడంతో మైనింగ్‌కు విక్రయించలేదు. అయితే లీజు కింద ఒప్పందం నడుస్తోంది. భూమి కోల్పోయే రైతు కుటుంబానికి ఉపాధి చూపుతామని గతంలో కంపెనీ ప్రతినిధులు చెప్పారని, తీరా ఇప్పుడు భూమి అమ్మితేనే ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారని రైతు కుటుంబం వాపోతోంది. ఎక్కడెక్కడి వారికో మైనింగ్‌లో ఉపాధి కల్పిస్తున్నారని, భూములు కోల్పోయిన తమకెందుకు ఉపాధి కల్పించరని వాగ్వాదానికి దిగారు. మైనింగ్‌తో తమ భూములు నాశనమవుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉపాధి చూపాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్‌ఐ మైనింగ్ ప్రదేశానికి వెళ్లి రైతు కుటుంబానికి నచ్చజెప్పారు. సమస్య ఉంటే న్యాయపరంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆలయ హుండీలపై దొంగల కన్ను

హొళగుంద: ఆలయాల్లోని హుండీలపై దొంగల కన్ను పడింది. రాత్రిళ్లు హుండీలను పగులగొట్టి కానుకలను దోచుకెళుతుండడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ మద్దిలింగదహళ్లి (ఎం.డీ హళ్లి) గ్రామంలోని భీరలింగేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీని ధ్వంసం చేసి కానుకలను ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. తాజాగా రెండు రోజుల క్రితం హొళగుంద సిద్దేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీని పగులగొట్టేందుకు విశ్వ ప్రయత్నం చేసి సాధ్యం కాక వెనుదిరిగినట్లు తెలిసింది. సుమారు రెండు నెలల క్రితం హొళగుంద సమీపంలోని శ్రీరామనగర్ క్యాంపులోని వరలింగ స్వామి, శ్రీరామ ఆలయంతో పాటు కోగిలతోట రోడ్డులోని వరబసవేశ్వర స్వామి ఆలయాలోని హుండీలను పగలగొట్టిన దుండంగులు వాటిలోని నగదు ఇతర కానుకలను ఎత్తుకెళ్లినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దుండగులు ఆలయాల్లోని హుండీలను టార్గెట్‌గా పెట్టుకుని చోరీ చేస్తున్నారు. వరుస చోరీ సంఘటనలతో ఆలయాల్లోని హుండీలకు భద్రత కరువైందని, దీనిపై పోలీసులు దృష్టి సారించి దొంగలను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గడ్డివామి దగ్ధం

హొళగుంద: స్థానిక బీసీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన వందవాగిలి సిద్దప్ప అనే రైతు పదెకరాల గడ్డిని నిల్వ చేసుకున్నాడని, అగ్ని ప్రమాదంలో మొత్తం కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఆలూరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపు చేయడంతో పక్కన ఉన్న గడ్డివాములు, గుడిసెలకు ప్రమాదం తప్పింది. దాదాపు రూ.60 వేలు వరకు ఆస్తి నష్టం సంభవించింది. పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.